క్లుప్తంగా

నవకవిత వైతాళికుడు శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : మహాకవి శ్రీశ్రీ నవకవితా వైతాళికుడని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం మహాకవి శ్రీశ్రీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి ఆ కేంద్రం సిబ్బందితో కలిసి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. అనంతరం శ్రీశ్రీరచలను, ఆయన కవితా ప్రభావాన్ని వివరించారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు ఎస్.రమేష్ రావు, హరిభూషణరావు మాట్లాడారు.బ్రౌన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'సీమ' సాహిత్య సదస్సు

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు మల్లికార్జునరెడ్డి తెలిపారు. 'చిన్న లక్ష్మిసుబ్బన్న జీవితం–సాహిత్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ చిన్న లక్ష్మికళావతి ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

శ్రామిక జీవుల సంక్షేమం కోసమే శ్రీశ్రీ కవిత్వం

కడప కల్చరల్: శ్రామిక జీవుల సంక్షేమం కోసమే శ్రీశ్రీ కవిత్వాన్ని వెలువరించారని వేంపల్లె ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇబ్రహీం అన్నారు. శనివారం స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్ శ్రీశ్రీ జయంతి సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీం మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం సామాజిక చైతన్యాన్ని రగిల్చిందని, యువతను ఉత్తేజపరిచి సమాజానికి పనికొచ్చేలా స్ఫూర్తినిచ్చిందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఇబ్రహీం తాను రచించిన రాయలసీమ కవిత్వం దిశ–దశ, సంపాదకత్వం వహించిన మరో వ్యాస సంపుటిలను విద్యార్థులకు అందజేశారు.

7న ఉచిత వడుగులు

కడప కల్చరల్ : కడప నగరంలో లజ్నతుల్ ఉలేమా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మే 7న పేద ముస్లిం బాలలకు ఉచితంగా వడుగులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి మౌల్వీ మహమ్మద్ అలీ రషాది తెలిపారు. స్థానిక బీడీ కాలనీలోని మక్కా మసీదులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 6లోగా చిన్నారుల పేర్లను 98484 14871, 97031 53169 నెంబర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు.

1 నుంచి ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్

కడప కల్చరల్: నగరంలోని పలు చోట్ల మే 1 నుంచి 31 వరకు ఉచిత ఇస్లామిక్ సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు ముఫ్తీ హజరత్ మహమ్మద్ అలీ బగ్దాదీ సాహెబ్ తెలిపారు. జామియా ఇస్లామియా వ యతీమ్ ఖానా మహమ్మదుర్ రసూలుల్లాహ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ క్యాంపు ఆయా కేంద్రాల్లో ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 8.30 వరకు నడుస్తుందని వివరించారు. ఆసక్తి ఉన్నవారు 9440972157 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: కడప మండల పరిధిలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. ఈ విషయమై శనివారం ఎంఈఓ పాలెం నారాయణను తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పొగుల వెంకట్రామిరెడ్డి, కడప మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలనాయుడు, నరేంద్రనాథరెడ్డి, జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. నగరంలోని పలు కూడళ్లలోనూ, రోడ్డు వారగా జీవిస్తున్న యాచకులు, నిరుపేదలకు వారు అన్నం పొట్లాలను అందజేశారు. సొసైటీ సహాయ కార్యదర్శి విజయ్, సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

కడప కల్చరల్ : జీవని వృద్ధాశ్రమ నిర్వాహకులు, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ పి.సంజీవమ్మ, టక్కోలు మాచిరెడ్డి దంపతులను శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేశు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల విజయవాడ పుస్తక ప్రదర్శనశాలలో ప్రమాదవశాత్తు కిందపడి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆ దంపతులను వృద్ధాశ్రమం కార్యాలయంలో కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని డీ కొత్తపల్లెలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను గురించి వివరించారు. గ్రామంలోకి రావడానికి వంకపై కల్వర్టును, అలాగే శ్మశానానికి వెళ్లే దారిలో వంకపై కల్వర్టును నిర్మించాలని, గ్రామం నుంచి వల్లూరుకు వెళ్లే దారిని తారు రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరారు. ఈ మేరకు వాటిని మంజూరు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ హరి కేశవ రెడ్డి, సర్పంచ్ కుళాయప్ప, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, భీమారెడ్డి శివారెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, శివశంకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రభుపీటి రమణ, బొందుగాల్ల దస్తగిరి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు... గ్రాండ్ సక్సెస్

కమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు.. కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయిందని, రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ సైనికులు 1.45 కోట్ల గృహాలు సందర్శిస్తే 1.10 కోట్ల మిస్డ్ కాల్స్‌తో ప్రజలు జగనన్నకు మద్దతు తెలిపారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు.. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 15వేల సచివాలయాల పరిధిలో చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే ఒక చారిత్రాత్మకం అన్నారు. 7 లక్షల మంది పార్టీ సైనికులు 1.45కోట్ల గృహాలు సందర్శించారన్నారు. అందులో 1.10 కోట్ల కుటుంబాలు మిస్డ్‌కాల్స్ ఇచ్చి తమ మద్దతును జనగన్నకు తెలిపారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గృహసారధులకు ఆయన కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. అలాగే కమలాపురం నియోజకర్గంలో కూడా 89శాతం ప్రజలు తమ మద్దతును తెలియజేశా రన్నారు. సర్వే పూర్తి అయిన తర్వాత గ్రామాల వారీగా వివరాలు వెల్లడిస్తామన్నారు. చివరి రోజు కార్యక్రమం ఇంకా పూర్తి కాలేదని, పూర్తి అయితే మరింత డేటా పెరిగే అవకాశం ఉందన్నారు.వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హిందూ స్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలి

- స్థల ఆక్రమణలో టీడీపీ నేత అమీర్‌బాబు
- పార్టీలకతీతంగా పోరాటం చేస్తున్నాం
- సమావేశంలో కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న గౌస్‌నగర్ హిందూ శ్మశాన వాటిక కమిటీ సభ్యులు

కడప రూరల్: నగరంలోని గౌస్ నగర్ హిందూ స్మశాన వాటిక స్థలం కబ్జాకు అడ్డుకట్ట వేయాలని ఆ స్మశాన వాటిక కమిటీ సభ్యులు శివకేశవ, బండి బాబు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ 1976లో అప్పటి జిల్లా కలెక్టర్ సంజీవ్‌రెడ్డి స్మశాన వాటికకు 6.40 ఎకరాలను కేటాయించి, హద్దులను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి స్థానికంగా ఉంటున్న ఆకుల వీధి తదితర ప్రాంతాలకు చెందిన వారు ఈ స్మశాన వాటికను సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన అమీర్‌బాబు మరి కొంత మంది దాదాపు రెండెకరాల స్థల ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కూడా పార్టీలకతీతంగా న్యాయం కోసం పోరాడుతున్నామని అన్నారు. అయితే డీప్యూటీ సీఎం అంజద్ బాషాపై నిందలు మోపడం తగదన్నారు. ఇందుకు సంబంధించి ఆక్రమణ దారులు న్యాయ స్థానం వారు స్టే ఇచ్చారని చెప్పుకోవడం అబద్ధమన్నారు. అధికారులు వాస్తవాలను పరిగణలోకి తీసుకొని స్మశాన వాటిక పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్య, లక్ష్మీనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

రజకులను మళ్లీ కులవృత్తుల్లోకి తీసుకుపోతారా!



మాట్లాడుతున్న లోగిడి జయన్న

కడప కార్పొరేషన్: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే రజకులకు వాషింగ్ మెషీన్లు, ఇస్త్రీపెట్టెలు, ఉచిత కరెంటు ఇస్తామని నారా లోకేష్ చెప్పడం దారుణమని పర్యాటక శాఖ రాష్ట్ర డైరెక్టర్ లోగిడి జయన్న అన్నారు. శనివారం సాయంత్రం కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, ఇళ్ల పట్టాలు వంటి పథకాలతో రజకుల జీవితాలు మారిపోయాయని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు. లోకేష్ తన పాదయాత్రలో రజకులను మళ్లీ కులవృత్తుల్లోకి తీసుకుపోయేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ రజకులకు వాషింగ్ మెషీన్లు ఇస్తాం, 500 యూనిట్ల వరకూ కరెంటు ఉచితంగా ఇస్తామని చెప్పడం అవమానించడమేనని ధ్వజమెత్తారు. రజకులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వానికి ఎల్లప్పుడు మద్దతుగా ఉంటామని చెప్పారు. రజక ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎం. మల్లయ్య, బీసీ నాయకులు ఎం. సుబ్బరాయుడు, కె. సతీష్, పి. మనోజ్ కుమార్, అలీ పాల్గొన్నారు.

ఇంజెక్షన్ వికటించి మహిళ మృతి

- ఫాతిమా వైద్య కళాశాలలో ఘటన
- మృతదేహంతో క్యాజువాలిటీ వద్ద బంధువుల ఆందోళన




ఫాతిమా వైద్యకళాశాల క్యాజువాలిటీ వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

కడప అర్బన్: సూది మందు వికటించి ఓ మహిళ మృతి చెందింది. నగరంలోని ఫాతిమా వైద్య కళాశాలలో శనివారం జరిగిన ఈ ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. కడప ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన వెంకటలక్షుమ్మ (57) ఫాతిమా మెడికల్ కళాశాలకు అద్దె పేషెంట్ల మాదిరిగా వచ్చేది. రోజుకు రూ.150 చొప్పున తీసుకుంటూ సుమారు నెల రోజులుగా ఇక్కడికి వస్తోంది. ఈ క్రమంలో శనివారం తన చేతికి గాయమవడంతో ఆ గాయాన్ని శుభ్రం చేసిన అక్కడి వైద్య సిబ్బంది ఆమెకు టీటీ ఇంజెక్షన్‌తో పాటు, నొప్పి త్వరగా తగ్గేందుకు మరో ఇంజెక్షన్‌ను వేశారు. కొంతసేపటికే వెంకట లక్షుమ్మ నోటి నుంచి నురగ వచ్చి మృతి చెందింది.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే..

ఫాతిమా ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే వెంకటలక్షుమ్మ మృతి చెందిందని బంధువులు ఆరోపించారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ వద్ద మహిళ మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆందోళనకారులు క్యాజువాలిటీ వద్ద అద్దాలను పగులగొట్టారు. పూలకుండీలను ధ్వంసం చేశారు. ఈ క్రమంలో తాలూకా సీఐ ఉలసయ్య, ఎస్ఐలు రామకృష్ణ, తాహీర్ హుస్సేన్ తమ సిబ్బందితో కలిసి రంగప్రవేశం చేసి బందోబస్తు నిర్వహించారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆందోళనను సద్దుమణిగేలా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనపై ఫాతిమా కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేసును వివరణ కోరగా వెంకట లక్షుమ్మ రోజు మాదిరిగానే ఆసుపత్రికి వచ్చిందన్నారు. చేతికి గాయమవడంతో టీటీ ఇంజక్షన్‌తో పాటు, మరో ఇంజెక్షన్‌ను ఇచ్చారన్నారు. తరువాత 45 నిమిషాల వ్యవధిలో ఆమె మృతి చెందిందన్నారు. ఆమె మృతికి ఫాతిమా వైద్య కళాశాల యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

జేసీఎస్ జోన్ ఇన్‌చార్జులకు సన్మానం



జేసీఎస్ జోన్ ఇన్‌చార్జులను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్ బాషా

కడప కార్పొరేషన్: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు (జేసీఎస్) జోన్ ఇన్‌చార్జులను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఘనంగా సన్మానించారు. కడప నగరంలో 90వేలకు పైగా గృహాలను సందర్శించి మెగా పీపుల్స్ సర్వేను పూర్తి చేయడంలో జోన్ ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు విశేష కృషి చేశారని తెలిపారు. జోన్ ఇన్‌చార్జులుగా ఉన్న మల్లికార్జున, షఫీ, రామలక్ష్మణ్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ పాల్గొన్నారు.

'ఆదరణ'లో అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐఏఎస్ హరి కిరణ్‌జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం సాయంత్రం అన్నదానం నిర్వహించారు. నగరానికి చెందిన శ్రీకాంత్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆశ్రమంలోని అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్; సురేంద్ర, శివ, సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం

కడప కల్చరల్ : జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్‌ను శనివారం కడప నగరానికి చెందిన బీ3 జిమ్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. జిమ్ డైరెక్టర్ బాషా మోహిద్దీన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మూడు సంవత్సరాలుగా సివిల్ జడ్జి మోతీలాల్ ఉత్తమ పనితీరుతో అన్ని వర్గాల ఆదరాభిమానాలను చూరగొనడం అభినందనీయమన్నారు. కృష్ణా జిల్లా తిరువూరుకు బదిలీపై వెళుతున్నారని, ఈ సందర్భంగా ఆయనను అభినందించడం తమ కర్తవ్యంగా భావిస్తున్నామని తెలిపారు.

హెచ్ఐవీ చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : హెచ్ఐవీ బారిన పడిన చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని గ్రేస్ మిషన్ సంస్థ ప్రతినిధి జోయల్‌పాల్ సూచించారు. శనివారం నగరంలోని ఎర్రముక్కపల్లె సమీపంలో ఉన్న హెచ్ఐవీ/ఎయిడ్స్ కార్యాలయంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు న్యూట్రిషియన్ ఫుడ్ అందజేశారు. ప్రతినెల హెచ్ఐవీ చిన్నారులకు తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, ఉషారాణి, పద్మావతి, లోకేష్, మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి యోగా శిబిరం

కడప కల్చరల్ : వేసవి సెలవును దృష్టిలో పెట్టుకుని చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఉచిత యోగా శిబిరాన్ని మే 1 నుంచి నిర్వహించనున్నట్లు మిత్ర యోగా సెంటర్ నిర్వాహకులు, ప్రముఖ యోగా నిపుణులు ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు కె.కల్పన తెలిపారు. 7 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలు పాల్గొనవచ్చని, ఉదయం 7 నుంచి 9 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పెద్దల కోసం మే 1 నుంచి ప్రత్యేక బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 5.30 నుంచి 7 వరకు ఈ శిక్షణ ఉంటుందని వివరించారు.

మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి కోరారు. ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టిన వెంకట కృష్ణారెడ్డిని కలిసి సమస్యలపై చర్చించారు. వేసవిలో మోడల్ స్కూళ్ల టీచర్ల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. అలాగే అర్హులైన వారికి పదోన్నతులతోపాటు కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. సంఘ నాయకులు శివప్రసాద్, లవకుమార్‌రెడ్డి, కృష్ణ, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్పెషల్ క్యాంపులో భాగంగా కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల్ నాగరాజు మాట్లాడుతూ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

చింతకొమ్మదిన్నె : మండలంలోని మూలవంక గ్రామంలో వెలసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నా రు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం, రాత్రికి స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె: వీరపునాయునిపల్లెలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజుల్‌రెడ్డి పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రిజర్వేషన్లు రద్దు వ్యాఖ్యలు దారుణం



భగత్‌సింగ్ నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం దారుణమని అఖిలపక్ష నాయకులు సత్తార్, చంద్ర పేర్కొన్నారు. ఈ విషయమై నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ముస్లిం ఓట్లు తమకు అక్కర్లేదని తెలంగాణలో జరిగిన బహిరంగ సభలో హోంమంత్రి అమిత్‌షా చెప్పడం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందన్నారు. తొలగించిన మైనార్టీల రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఎప్పుడో కల్పించారని ఇప్పుడు ప్రత్యేకంగా కల్పించేది ఏముందన్నారు. అఖిల పక్ష నాయకులు బండి జకరయ్య, సావంత్ సుధాకర్, రామ్మోహన్, జాకీర్ మౌలానా పాల్గొన్నారు.

ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో...... ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బషీరున్నీషా పేర్కొన్నారు. శనివారం నగర శివార్లలోని భగత్‌సింగ్ నగర్‌లో ముస్లిం మైనార్టీల రిజర్వేషన్ల రద్దును నిరసిస్తూ ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు ప్యారీ, బీబీజాన్, షంషాద్, జమీల తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని తాకట్టు పెడుతున్న కేంద్రం



ప్రచార భేరికి తరలివస్తున్న వామపక్ష నేతలు

కడప వైఎస్సార్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోందని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేశు, ఉమామహేశ్వర్‌రావు ధ్వజమెత్తారు.బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో ఐటీఐ సర్కిల్‌లో బహిరంగసభ నిర్వహించారు. సభకు అనుమతి లేకపోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి బడా బాబులకు దోచి పెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానిలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నడం దారుణమన్నారు. ముస్లింల రిజర్వేషన్లను రద్దుచేసి ప్రజల మధ్య కులాల చిచ్చు పెట్టేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. మోదీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజల్ ధరలను అమాంతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలను మోపుతోందన్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో మోదీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రచార భేరి నిర్వహిస్తుండగా అడ్డుకోవడం తగదన్నారు. అనంతరం పోలీసులు వామపక్ష నేతలు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీపీఐ, సీపీఎం నాయకులు చంద్ర, చంద్రశేఖర్, వెంకట శివ, రామ్మోహన్, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, వేణుగోపాల్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి పుట్టగతులుండవ్

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీకి పుట్టగతులు లేకుండా చేస్తామని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు, ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడుకునేందుకు యావత్ ప్రజానీకం నడుం బిగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార భేరి విజయవంతంగా సాగుతోందని .. కానీ కడపలో బహిరంగ సభ నిర్వహించుకోవడానికి ఎస్పీ అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంకట శివ, రామ్మోహన్ పాల్గొన్నారు.

పోస్టల్ సంఘాల గుర్తింపు పునరుద్ధరించండి

కడప కల్చరల్ : రద్దు చేసిన పోస్టల్ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ సంఘాలకు పోస్టల్‌శాఖలో 70 శాతానికి పైగా సభ్యుల బలం ఉందని, ఐదుశాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుపై పై సంఘాల గుర్తింపును రద్దు చేయడం భావ్యం కాదన్నారు. అర్థం పర్థం లేని కారణాలతో ఆ సంఘాల గుర్తింపు ను కేంద్ర రద్దుచేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. రద్దు నిర్ణయాన్ని పునః పరిశీలించాలని, ఆ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని వారు కోరారు.

కళాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి



నృత్య గురువు విజయశాంతి,చిన్నారులను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో ఎంతోమంది కళాకారులు ఉన్నారని, వారిని జిల్లా అధికారులు, ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మూర్తినాయుడు అన్నారు. శనివారం అంతర్జాతీయ నృత్య దినోత్సవ సందర్భంగా పాత కలెక్టరేట్ ఎదురుగా గల పెన్షనర్ల భవనంలో ముద్ర డ్యాన్స్ అకాడమి చిన్నారులచే నృత్యాలు ప్రదర్శింపజేశారు. అలాగే కడప నగరంలో దాదాపు 30 సంవత్సరాలుగా ముద్ర డ్యాన్స్ అకాడమి నిర్వహిస్తున్న కూచిపూడి కళాకారిణి విజయశాంతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరీముల్లా, పెన్షనర్ల సంఘం సభ్యులు రాధాకృష్ణ, సుబ్బరాయుడు, సత్యరాజు, మల్లయ్య, నాగయ్య, నారాయణరెడ్డి, నారాయణ, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఏపీ జీఎల్ఐ, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నాయకులు దివాకర్‌బాబు, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రటరీ రాజశేఖర్, ఏపీ జేఏసీ అమరావతి కోశాధికారి రొనాల్డ్ శ్యామూల్‌రాజ్, వైస్ చైర్మన్ పురుషోత్తం, ఏఐటీయూసీ నాయకులు కొండయ్య, రాజశేఖర్, బాల వెంకటేశ్, రామ్మూర్తి, చంద్రశేఖర్, లచ్చన్న, తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.


జేఈఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో డీజీఎం, డీన్, ఏజీఎం, ప్రిన్సిపాల్స్



ఫణీంద్రనాథ రెడ్డి



ఆకేపాటి శ్రియ

కడప ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకు పంట పండించారు. ఇందులో భాగంగా సాయి గణేష్‌శర్మ 208వ ర్యాంకును, వాగ్దేవిరెడ్డి 485వ ర్యాంకును, వంశీకృష్ణారెడ్డి 1340వ ర్యాంకును, శ్రీనివాస్‌రెడ్డి 1445వ ర్యాంకును, మనోజ్‌కుమార్‌రెడ్డి 2824వ ర్యాంకును, దివ్య 7472వ ర్యాంకును హితేష్‌రెడ్డి 7490వ ర్యాంకును, తేజేష్ 7718వ ర్యాంకును, హర్షవర్ధన్‌రాజు 15,947వ ర్యాంకు, మనీష్ అహ్మద్ 17254వ ర్యాంకులను సాధించారు. ర్యాంకర్లను నారాయణ జూనియర్ కళాశాల డిజిఎం రామోహన్‌రెడ్డి,డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఏజీఎంలు చెన్నక్రిష్ణారెడ్డి,ప్రతాప్‌రెడ్డి తదితరులు అభినందించారు.

• 77వ ర్యాంకుతో సత్తా

నగరానికి చెందిన దుంపల ఫణీంద్రనాథ రెడ్డి జేఈఈలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ఓపెన్ కేటగిరిలో 77వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్ కోటాలో 5వ ర్యాంకును సాధించాడు. ఈ అబ్బాయి ఇంటర్మీడియట్‌ను విజయవాడలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదివాడు. ఫణీంద్రనాథరెడ్డి తండ్రి సుదర్శన్‌రెడ్డి కడపలో మున్సిపాలిటిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండగా తల్లి ఆశాలత గృహిణి. తమ కళాశాల విద్యార్థి 77వ ర్యాంకు సాధించడంపై కడప శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరెడ్డి, ఏవో శుభాకాంక్షలు తెలిపారు.

శ్రియ ప్రతిభ

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కడప నగరానికి చెందిన ఆకేపాటి శ్రియ ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ఓపెన్ కేటగిరిలో 317 ర్యాంకును సాధించింది. ఈమె ప్రస్తుతం హైదరాబాదులోని మాదాపూర్ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శ్రియ తండ్రి శ్రీనివాసులరెడ్డి కడప నగరపాలక ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా, తల్లి చప్పిడి సుభాషిణి గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా ఉన్నారు.